# రీతిగౌళ

సుందరం, నేనూ కలిసి పొలాల గట్లంటే వెళ్ళుతున్నాం. సాయంత్రం షికారు ముగించి యింటికి చేరుకుంటున్నాం. అప్పటికే చాలా చీకటి పడింది. అవసరం అనిపించినప్పుడల్లా సుందరం చేతిలోని టార్చిలైటు వెలిగిస్తున్నాడు. ఇక యింటికి వెళ్ళి పడుకుంటే మళ్లీ తెల్లవారిందాకా ఒకటే నిద్ర.

పొలానికి అడ్డంగా ఒక కాలిదారి వెంట నడుస్తున్నాం. సుందరం లైటు వెలిగించి ఆరిపేయబోతూ వుండగా, దగ్గర్లో గడ్డి వాము దగ్గిర యేదో చప్పుడయింది. ఆ కొద్దిపాటి కాంతిలో ఎవరిదో భయపడ్డ ముఖం అస్పష్టంగా కనిపించింది. తరవాత హడావిడిగా నడుస్తున్న అడుగుల చప్పుడు వినిపించింది.

"కుందేలు పరుగు లంకించుకున్నాడు. మనం బెదరగొట్టేశాం" అన్నాడు సుందరం. అతని పెదవులమీద ఒక్కక్షణం పాటు చిరునవ్వు కనిపించి మాయమయింది.

"కుందేలంటావేమిటి? నేనెవరో మనిషనుకున్నానే!"

"మనిషే, కుందేలనేది హాస్యానికి పెట్టిన పేరు" అన్నాడు సుందరం చాలా నిర్లక్ష్యంగా.

"రాత్రిళ్ళు అలా తిరుగుతున్నాడెందుకు? పిచ్చా? చాదస్తమా?"

"అదేం లేదు. చూడు, అక్కడ పొడుగాటి చెట్లు వున్నాయే. ఆ ప్రాంతమంతా అతనిదే. ఇక్కడి ధనిక మోతుబరుల్లో అతనొకడు!

సుందరం ఈ వూళ్ళో చాలా రోజులుగా బడిపంతులుగా వుండడంచేత అతనికి యిక్కడి మనుషుల వివరాలు చాల మటుకు తెలుసు. అతను ఈ కుందేలును గురించి మరికాస్త వివరంగా నాకు చెప్పాడు. అదే ఈ కథ.

సరిగా యిరవై అయిదు సంవత్సరాల క్రిందట సాంబయ్య అనే పెద్ద కామందు యితన్ని పాలేరుగా చేర్చుకున్నాడు. ఈ కొత్తపాలేరు నెమ్మదీ, నిదానమూ, వొళ్ళు దాచుకోకుండా పనిచేయడమూ - కొన్ని రోజులకే ఊరంతా గొప్పగా ప్రచారం అయిపోయినాయి. ఓ సంవత్సరం గడిచాక ఈ పాలేరు మళ్ళీ సంవత్సరానికి సాంబయ్యగారి దగ్గరే పాలేరుతనం చేయడానికి వొప్పుకోవడం ఈ ఊళ్ళోవాళ్ళందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. అప్పట్నుంచీ యితన్ని అందరు స్వంతపేరుతో పిలవడం మానివేసి ''కుందేలు'' అనే మారుపేరు తగిలించారు. సాంబయ్యగారి దగ్గర ఏ పాలేరూ ఒక సంవత్సరంకంటే ఎక్కువ కాలం పనిచేయడం జరగదు. ఏమంటే ఆయన వల్లమాలిన పని చెప్పడమేకాకుండా తన కోపం అంతా వాళ్ళమీదనే చూపించే వాడు. వాళ్లను అర్ధాకలితో వుంచేవాడు. కుందేలుగాడు అసలు పాలేరుతనానికి వచ్చిన యేడు రోజులు చాల చౌకగా వున్నాయి. రూపాయి పెడతే కావలసినన్ని సరుకులు. అరబస్తా ధాన్యానికీ, ఒక జత బట్టలకూ కుందేలు సంవత్సరం తరబడి పనిచేసేవాడు. అందులోనూ సామాన్యమయిన పనికాదు. పొలాలకు ఎరువువేయడం, దున్నడం, విత్తులు చల్లటం, కలప యేరటం, పంటకాపలా, తాళ్ళు పేనటం, పనిముట్లు బాగుచేయడం, పట్టణానికి వెళ్ళడం రకరకాల పిండులు పట్టించుకురావడం యింకా ఎన్నో చిల్లరపనులు ఇవన్నీ కాక ఏదో పనిలో కాస్త సమయం మిగుల్చుకుని ఇంటామెకు వెన్నతీయడంలో సాయపడేవాడు. దొడ్లో చెట్ల్లో చేమల సంగతి చూస్తూ వుండేవాడు. శీతాకాలమయేది. ఎండాకాలమయేది - అతను మటుకు సూర్యోదయం కాకముందే మేల్కొని పొలానికో, గొడ్లు కాయడానికో పోతూ వుండేవాడు. ఎండా, వానా, చలీగిలీ యేదీ అతని పనికి ఆటంకం వచ్చేవికావు. కన్ను పొడుచుకున్నా కనిపించనంత చీకటి పడితేగాని యింటికి తిరిగి వచ్చేవాడు కాదు. ఇంత గంజితాగి జుర్రున త్రేన్చి సంతృప్తి పడేవాడు. అతని పడక యింటి వెనుక పశువుల పాకలో. అతను పడుకునే ఎండుగడ్డి పరుపు సంవత్సరానికో సారిగాని మరమ్మతు అయేది కాదు. అప్పుడప్పుడు దాన్లో ఎలుకలు సంసారం చేసి పిల్లల్ను పెట్టటం కూడా కద్దు.

ఒక్క సెలవు రోజుల్లో మాత్రం అతను మామూలు కన్నా ఎక్కువ సేపు నిద్రపోయేవాడు. ఆ రోజే వంటినిండా స్నానంచేసేవాడు. ఈ విశ్రాంతి రోజుల్లోనయినా, యితను తన తోటి వాళ్ళతో కలిసి మెలిసి కబుర్లాడుకుంటూ కాలక్షేపం చేసేవాడు కాదు. వంటింట్లో యింటి యజమానురాలికి సాయం చేస్తూండేవాడు. ఆమె దీక్షగా సదుం

బిగించి, పాడుకుంటూనో మాట్లాడుకుంటూనో యింటి పనులు చేసుకుంటూ వుంటే చూస్తూ కూరుని తనలో తాను మురిసిపోతూ కాలం గడిపేవాడు. ఆమెకు పాడడమంటే చాలా ఇష్టం. పాడుతూ ఆమె ఉద్రేకం పొందేది. గాఢంగా నిట్టూర్పులు విడిచేది. రొమ్ములు ఉచ్ఛ్వాసనిశ్వాసాలు స్పష్టపరిచేవి. కళ్ళలో నీళ్లు గిర్రున తిరుగాడేవి. ఆమె చాల దయార్ద్ర హృదయిని. ఎప్పుడూ కుందేలుని పల్లెత్తుమాట అనేదికాదు, అంతేగాక యజమాని ఏమన్నామితిమీరి మాట్లాడినపుడు అతనితో వాదనకు దిగుతూ వుండేది. చిన్నతనంలో ఆమె చాలా అందంగా ఉల్లాసంగా ఉండేది. కాని యీ ఇంటికి వచ్చాక – సాంబయ్యను పెళ్ళి చేసుకున్నాక – ఆమె అందమంతా యింకిపోయింది. సాంబయ్యాగారు తను ఆమెకన్నా చాల సంవత్సరాల పెద్దవాడయి కూడా పిల్లలకోసం ఆమెనే దుయ్యబట్టేవాడు. భార్య గొడ్రాలుతనం గుర్తుకు వచ్చినప్పుడల్లా ఆయనకు విపరీతమయిన కోపంవచ్చి విరుచుకుపడుతూ వుండేవాడు. ఒకవేళ ఆమె తనకూ ఈ యింట కొన్ని హక్కులు వున్నాయి అన్నదా – అస్తి పంపకం చేయడానికి కూడా తయారయేవాడు. ఆయన కోపం చాల సేపటికిగాని తగ్గదు. శివమెత్తినట్లు యిల్లు నాలుగు మూలలా గంతులువేసేవాడు. అన్ని సామాన్లూ ఒక కుప్పగా పోసేవాడు. ''యిదుగో – యిదేగా నీ సంపాదన, యిదేనా నువ్వు నాకు తెచ్చిన కట్నం. మాట్లాడవేమే మొద్దూ'' అనేవాడు.

ఆ సమయానికి చుట్టపక్కాలెవరయినా వుండడం తటస్థిస్తే, యీ తగాయిదా అంతా ఆస్తిపాస్తుల ప్రదర్శనగా తయారయేది. పిచ్చి ధోరణి మానివేయడంలేకపోగా – తను సంపాదించినవన్నీ చూపి వాటికోసం తను చెమటనూ, రక్తాన్నీ ధారపోసిన వైనం, వివరిస్తూ వుండేవాడు. అన్నీ అయినాక---- ఆమెను యింకా ఎగతాళి చేసేందుకు, ఆవిడగారు కొన్న ఉయ్యాల ప్రదర్శించేవాడు. ఈ హాస్యానికీ అవమానానికీ ఆవిడ తట్టుకోలేక యిరుగుపొరుగు యిళ్ళలో తలదాచుకునేది. కొన్ని గంటలసేపు---. సాంబయ్యాగారు బలవంతాన ఆమెను యింటికి లాక్కువచ్చేవాడు. ఒకవేళ ఆమె పుట్టింటికి పారిపోవడం తటస్థిస్తే ఆమె తల్లిదండ్రులే భద్రంగా తీసుకువచ్చి ఆమెను సాంబయ్యాగారికి అప్పజెప్పివెడుతూ వుండేవాళ్ళు. ఆమె స్వంత తల్లే కూతురు మాటలు పెడచెవిని పెట్టింది. ''మీ భర్త వొట్టి కోపిష్టివాడే అవుగాక! అతని శక్తంతా ఖర్చయేందుకే అలా కోపం తెచ్చుకుంటాడేమో. నన్నడిగితే అతనికి కోపం వచ్చినప్పుడు నీవు తగ్గి వూరుకోవడం మంచిది. అతనంటే ప్రేమగా వుండవే పిచ్చి తల్లీ, ఆ పైన నువ్వు కోరిందల్లా ఫలిస్తుంది''అనేది ఆమె తల్లి.

"నాకేమీ అక్కరలేదు. నన్ను యిక్కడే పడి వుండనివ్వు. కాయకష్టంచేసి మీతోపాటు యింత కలో గంజో తాగుతాను. యింకేమయినా పేచీలు పెడితే అప్పుడు అడుగు. నేను అసహ్యంచుకునే వాడికిచ్చి పెళ్ళిచేసి నన్ను సజీవ సమాధి చేశావు" అనేది కూతురు, దుఃఖంతో మునిగిపోయి.

"నీకేమన్నా మతి పోయిందేమిటే---- లేక మమ్మల్ని నలుగురిలోనూ తలవంచుకునేట్టు చేద్దామనుకుంటున్నావా? మొగుడిని వదిలిపేస్తే యింక నీ ముఖం ఎవరు చూస్తారు? నీ దిక్కెవడు ఆలకిస్తాడు?"

ఈ మాటలకు ముసలి సాంబయ్యాగారి పడుచుపెళ్ళాం నేలమీదపడి దొర్లేది, గుండెలు బాదుకుంటూ కోటి దేవుళ్ళని తల్చుకునేది.

"నిజం అమ్మా, నిజం. ఇందుకు దేవుడే సాక్షి. ఇందులో నా తప్పు యేమీ లేదు. అంతా ఆయనగారి లోటే!"

"నువ్వనేది నిజమో అబద్ధమో ఆ భగవంతుడికే తెలియాలి. కాని అందరి దృష్టిలోనూ నీదే లోటు. మగవాడికేమీ ఫరవాలేదు. అందులోనూ ఆయనలాంటి ఐశ్వర్యవంతుడికి అసలే ఫరవాలేదు. ధైర్యం తెచ్చుకుని, ఇక ఇంటికి నడువు. కాసుకు కొరగానిదానివి, నిన్ను సాంబయ్యగారు చేసుకొనటమే గొప్ప అదృష్టం అని తెలుసుకో" అనేది తల్లి!

ఇట్లాంటి పోట్లాటే ఆయిన తర్వాత, ఆమె ఒకసారి తల్లితండ్రులతో అన్నది: "నాకే గనుక ఒక ప్రియుడు వుంటే – తప్పకుండా సంతానం కలుగుతుంది" ఈ మాటలకు ఆమె తల్లీ తండ్రీ చాలా బాధపడ్డారు, కూతురును కోప్పడి భర్త దగ్గర దిగ విడిచి వచ్చారు.

సాంబయ్యతో కూడిన వ్యవహారమంతా నిర్జీవంగానే వుంటుంది. ఆయన యింట్లో వంట సామానూ, పొలాల పనిముట్లు కూడా యజమాని తాలూకు కర్కశత్వాన్ని అలవరుచుకున్నాయి. కుక్కలు వూళ్ళో కల్లా భయంకరమయినవి. చెట్లు దయ్యాలను బోలి వుండేవి. కొమ్మలు కాయ బరువుకు వంగినట్టు నిస్సత్తువుగా దిగజారేవి, ఆ యింటి ముందు ముష్టివాళ్ళు బిచ్చమడుక్కోవటానికి జంకేవాళ్ళు. ఒక్కొక్క సంవత్సరం ఆయన ఐశ్వర్యం అంతకంతకూ పెరుగుతూ వున్నా, ఇంట్లో మటుకు కడుపునిండా తిండికి సైతం ప్రాప్తం వుండేదికాదు.

కుందేలు ఆకలితో మాడి చావటానికి కూడా తయారయినాడు. ఇంట్లో ఇతరులకు మల్లేనే అతన్ని కూడా వార్ధక్యం ఆవరించింది. సాంబయ్య జీతం యివ్వడం ఆపుచేసినా, కుందేలు సహిస్తూనే పనిచేస్తూ పోతున్నాడు.

ఇరుగు పొరుగు రైతులందరూ ఎరుగుదురు, కుందేలు కష్టపడి పని చేస్తాడనీ, మాంచి నమ్మకస్తుడనీ. కానివాళ్ళు ఎక్కువజీతం యిస్తామని ఆశ చూపినా, పని తక్కువేనని బతిమలాడినా కుందేలు సాంబయ్యగారి సేవ వొదిలి రావటానికి యిష్టపడలేదు. ప్రపంచంలో యింతకంటే తెలివి తక్కువ వాడు యింకొకడు వుండడు అనుకున్నారు వాళ్ళంతా. చాలమంది యిది తప్పకుండా ఉన్మాదమే అయివుంటుందనుకున్నారు కూడాను.

ఒక ఆదివారం – అప్పటికి కుందేలు యిక్కడచేరి పదిహేను సంవత్సరాలు అయింది– సాంబయ్యగారు భోజనం అయినాక, పడుకుని భగవద్గీత చదువుకుంటున్నారు. ఆయన దృష్టికి నేలమీద పడివున్న 'భక్ష్యం' ముక్క కనిపించింది. ఇలాంటి సందర్భాలలో ఆయన సాధారణంగా 'దుబారా'ను గురించి లెక్చరు యిచ్చి తన సంపాదనంతా యీ రకంగానే దుంపనాశం అవుతోందని తిట్టుకు లేచేవాడు భార్యవేపు. ఓ తిట్టుచూపు పడేసి ఆ ముసలాయన ఆ ముక్కను పయికి తీయటానికి కిందకి వంగారు. కాని ఆ క్షణంలోనే నేలమీదకి ఒరిగి పోయాడు. లేవదీసి పక్కమీద పడుకోబెట్టేసరికి, ఆయన చేయి విపరీతంగా వణుకుతోంది. కాని వణుకు కాసేపటికే తగ్గిపోయి, వొళ్ళు చల్లబడి కొయ్య అయిపోయింది.

సాంబయ్య పోయిన సంవత్సరంలో, కుందేలు ఆయన భార్యను పెళ్ళి చేసుకున్నాడు. ఈ అనుకోని సంఘటనతో గ్రామస్తులకు తలలో నాలుక మొలిచి నట్లయింది. ఇన్నాళ్ళూ కుందేలు సాంబయ్యగారి గరుడసేవ ఎందుకు మానాడు కాదో యిప్పుడు స్పష్టం అయింది. "వీడు యిన్నాళ్ళూ తెలివి తక్కువ వాడు అనుకున్నాం. కాదు, మనమే తెలివి మాలిన వాళ్ళం. వీడు యిన్నాళ్లూ సాంబయ్య భార్య కోసమే కనిపెట్టుకొని వున్నాడు'' అనుకున్నారు అంతా. నలభయి అయిదేళ్ళు నిండిన పెళ్ళికూతురు. ఇంకా యౌవనంలో వున్న ధృఢకాయుడైన వరుడు! వధూవరుల కళ్లలో సుఖప్రదమైన కాంతులు వెలిగాయి.

ఈ విధంగా సాంబయ్య యిల్లు కుందేలుకు సంక్రమించింది. ఇన్నాళ్ళూ ప్రేమంటే యేమీ ఎరగక, ఎవరిచేతా ప్రేమించ బడక వుండిపోయిన ఆవిడ – యిప్పుడు ఒక్కసారిగా తన మనో భావాలను ఎన్నో యేళ్ళుగా లోలోపలే దాచుకుంటున్నవాటిని తన రెండో భర్తమీద వర్షించింది. అసూయగా భర్త ఎక్కడికి వెడితే అక్కడికి తను కూడ వెడుతూ వుండేది! ఈమెను చూచి వూళ్ళో వాళ్ళంతా నవ్వనారంభించారు. అతను పక్క యింటికి యెవరితోనయినా మాట్లాడటానికి వెడితే, ఒక్క క్షణం ఆలస్యం అయితే చాలు, తను పరుగు తీసేది. అందులోనూ ఆ యింట్లో– యువతి ఎవరేనావుంటే మరీనీ. అతను మిల్లుకు వెళ్ళినా మార్కెట్టుకు వెళ్ళినా తనూ తయారయేది. ఖర్మం చాలక యింట్లోనే వుండి పోవల్సివస్తే, కిటికీ చువ్వలను పట్టుకుని వీధివంక చూస్తూ కూర్చునేది.

కొత్త దంపతులు ప్రశాంతంగానే కాలం వెళ్ళబుచ్చుతున్నారు. పిల్లలు లేకపోవడం అప్పుడప్పుడూ తలుపుకు వస్తూ వుండేది. కాని కుందేలు సాంబయ్యలా అతలా కుతలం అయేవాడు కాదు. ఆవిడ యిప్పటికీ పూర్తిగా ఆశచావక, డాక్టర్లను సంప్రదిస్తూ ఉండేది. ఆపసోపాలు పడతూ తన కష్టాలన్నీ వాళ్ళకు వివరిస్తూ వుండేది. కాని లాభంలేకుండా పోయింది.

ఆ యింటిని చాలకాలంగా. దురదృష్టం పీడిస్తూ వున్నట్లుంది. రెండు సంవత్సరాలు గడిచాయో లేదో ఆవిడగారి కాళ్ళు పడిపోయినై. ఇంక యీ రోగానికి తిరుగు లేదన్నారు డాక్టర్లు. ఇంటి పనికోసం ఒక ముసలి పనిమనిషిని పెట్టుకున్నారు. మళ్ళీ పడుచుదవుతే తన కాపరం రచ్చ కెక్కుతుందని ఆమె భయం. ఈ ముసలిదాన్నయినా తిన్నగా వేగనిచ్చేది కాదు. తను అవసరం అనుకున్నదాని కన్నా ఒక అర నిమిషం ఎక్కువ మాట్లాడితే "యేమిటి, యింతసేపు వెళ్ళావు? నాతో ఒక్కనిమిషమూ మాట్లాడవు, ఆ చెవిటి మొద్దుతో గంటల తరబడి మాట్లాడుతావు" అని సాధించేది. శీతాకాలం దుప్పటి ముసుగు పెట్టుకుని, కిటికీ దగ్గరే గంటల తరబడి కూర్చునేది కిటికీ రెక్కలకు తల ఆనించి, దొడ్లో పని చేసుకుంటున్న భర్తను గమనిస్తూ వుండేది. వేసవి కాలం ఎండలు మండి పోతున్నప్పుడు అతను భార్యను పొలాల వెంట మోసుకు వెళ్ళి–పెద్ద గుండిగను మోసినట్లు – ఓ చెట్టు నీడను కూర్చోబెట్టేవాడు. అక్కడ దూడలను ఆడించడమో, కోడి పిల్లలను పలకరించటమో, చిరిగిన గుడ్డలకు అతుకులు వేయడమో చేస్తుండేది. ఒక్కో సమయంలో నిద్ర పోయేది కూడాను. ఆమెగారు స్నానం చెయ్యాలని మనసు పడినప్పుడు

కుందేలు ఆమెను నది దగ్గరకు తీసుకుపోయేవాడు. --జాగ్రత్తగా స్నానం చేయించేవాడు. వొళ్ళు తోముకోవడంలోను, దుస్తులు విప్పుకోవడంలోను, తుడుచుకుందుకు - మళ్ళీ దుస్తులు వేసుకుందుకు ఆమెకు సహాయ పడేవాడు. శారీరకంగా బలహీనమయినా మానసికంగా రోజు రోజుకూ ఆమె చిన్న పిల్లలా తయారయేది. తనో ప్రౌఢ అన్నట్లుగానో, పదహారేళ్ళ బాలకుమారి అన్నట్లుగానో ప్రవర్తించేది. ప్రేమకోసం తపించి పోతున్న కళ్ళతో భర్తను సాదరంగా చూచి రెండు చేతులూ మెడచుట్టూ బిగించి ''హా! ప్రియతమా! నన్ను నీ చేతులతో పై కెత్తవా!'' అనేది. ఈ మాట అనడంతోటే చేతిలో పని ఎక్కడి దక్కడ వదిలేసి భార్యను భుజాలమీద కెక్కించుకుని, యింట్లో నాలుగ్గదుల్లో తిప్పేవాడు కుందేలు.

''నాకేం కావాలో ఊహించుకో. పాలు కాదు, పంచదార కాదు, తేనెపట్టూ కాదు, అంతకన్నా తీయనిదీ, మధురమయినదీ. ఒక్క ముద్దు యివ్వు - ఒక్కటి'' అనేది. కుందేలు వెంటనే శిరసావహించేవాడు, కాని ఆమె అంతటితో వదిలేది కాదు. ''మరోటి- యిదుగో - యీ బుగ్గమీద'' వేధించుకు తినేది.

కుందేలు కూడా యిదివరకులా లేదు. సంవత్సరాలు గడిచిన కొద్దీ అతని వొళ్ళు వొంగి పోతోంది. జుట్టు రాలి పోయి, బట్టతల అవుతోంది. ముఖం ముడుతలు పడుతోంది. అయినా యిప్పుడూ భార్యా భర్తల వయోభేదం చూచి చూడగానే కనిపించేది. ఈ సంగతులు ఏమీ తెలియని వాళ్ళు ఆమెను చూచి కుందేలుతో 'మీ అమ్మగారా?' అని అడగటం చాలాసార్లు జరిగింది. సంవత్సరాలు దొర్లిపోతున్న కొద్దీ ఆమె మరీ పసితనపు వాంఛలు పెంచుకునేది. ఒకానొక పుణ్యదినాన, సాయంత్రం పూట - హాయిగా పడుకుని - మూల్గకుండా---- మూలగకుండా---- గుటుక్కున ప్రాణాలు విడిచేసింది.

కుందేలు ఆమె అంత్య క్రియలు ఎంతో బాగా జరిపించాడు. డబ్బు ఊరికే వెదజల్లాడు. ఆమె ఆత్మశాంతి కోసం తను చెయ్యగలిగిందల్లా చేశాడు. ఇప్పుడిక సాంబయ్యగారి ఆస్తిపాస్తులకు అతను ఒక్కడే వారసుడు. ఇతను ప్రారంభించి కట్టిస్తున్న పెద్ద భవనం లాంటి ఇల్లు పూర్తవగానే చూసే భాగ్యం ఆమెకు లేకపోయింది. ఒక సంవత్సరం పాటు అతను విచారంగా గడిపాడు. ఇంతలో గృహ నిర్మాణం పూర్తయింది. కొత్తయింట్లో ప్రవేశిస్తూ కుందేలు తనతో వున్న గ్రామస్థు లందరికీ పెద్ద పెట్టున విందు చేశాడు. ఆ వూళ్ళో అటువంటి విందు జరగటం యిదే మొదలుట. గ్రామస్థులంతా యిల్లు అన్ని మూలలూ చూచి ఈ యేర్పాట్లన్నీ ఎంతో రమ్యంగా వున్నాయని

మెచ్చుకున్నారు. విందు చాల గంభీరంగా నిశ్శబ్దంగా జరిగింది. తరువాత సంభాషణలు కూడా హుషారుగా సాగినాయి. అతని చాకచక్యాన్ని, ఔదార్యాన్ని, మంచితనాన్ని అతిథులంతా వెయ్యినోళ్ళతో పొగిడారు. వాళ్ళు యితన్ని పాలేరుగా కాక, వంశపారంపర్యంగా యీ ఆస్తికి హక్కుదారయినటుగా---- తమతో సమాన స్థాయిలో గౌరవించసాగారు. భోజనాల సమయంలో అంతా సరదాగా సరసాలాడుకుంటూ వుండగా ఓ అతిథి ఆప్యాయంగా సూచించారు. కుందేలు మరేమీ వయసు మీరిపోయిన వాడు కాదనీ తిరిగి వివాహం చేసుకోవచ్చుననీ! "నిజమే సుమా! యిప్పటికే ఒక సంవత్సరం ఒంటరిగా గడిపాడు."

"అవును లంకంత యీ యింటిలో ఒక్కడూ ఎలా వుండడం?"

"ఇతనికో పెళ్ళి కూతురును చూడవలసిందే"- ఈ ప్రకారంగా అతిథులందరూ పై సూచనను బలపరిచారు. కుందేలు నవ్వాడు. అంగీకారసూచకంగా తల ఊపాడు. అతిథుల్ందరూ అతని భవిష్యత్తు కోసం - ఉల్లాస దాంపత్యం కోసం మళ్ళీ పానీయాలు సేవించారు. వాళ్ళలో ఒకరు లేచి కుందేలుకు దగ్గరగా వచ్చి అతన్ని దాదాపు కౌగలించుకుని "నీకు ఇష్టం అయితే మా అమ్మాయి లీలను యిస్తాను" అన్నాడు. మరో అతిథి గబుక్కున "మా అమ్మాయి సుజాత" అన్నాడు.

గౌరవనీయమైన అతిథులు అయిదారుగురు కుందేలును అంతటితో వదల్లేదు. చొక్కా సవరించారు. జుట్టు సవరించారు. వీపు తట్టారు. బుజాలు ఎగరవేశారు. కుందేలు వాళ్ళ బారినుంచి ఎలానో తప్పించుకుని తన కుర్చీలో కూర్చుని ఏడవసాగాడు. అందరికీ ఆశ్చర్యం అనిపించింది. అతని మనసుకు కష్టం కలిగించే మాటలు తాము యేం అన్నారు? ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు అదేపనిగా చూచుకున్నారు. చాలా సేపు అయినాక కుందేలు గట్టిగా నిట్టూర్చి లేచాడు. చేతులతో ముఖం కప్పుకుని గాద్గదికంగా చెప్పాడు. "యిరవై అయిదు సంవత్సరాలు దుర్భరమైన జీవితం గడిపాను. పదిహేను సంవత్సరాలు గానుగ ఎద్దులా పని చేశాను. కుక్కలా తిండికి మాడాను. తిట్లూ శాపనార్థాలు తప్ప యింకేమీ ఎరగను. మరో పది సంవత్సరాలు -మనసులో హేయపడుతూనే ఒక మనిషిని చేతులతో మోసుకు తిరిగాను. లోకం ముందు నవ్వుల పాలు అయినాను." చేత్తో కళ్ళు తుడుచు కున్నాడు. మరో కప్పు టీ తాగి - కప్పు బల్లమీదకి విసిరి కొడుతూ----"యిప్పుడో ఈ యింటికి నేనే యజమానిని" అన్నాడు మళ్ళీ కళ్ళు తుడుచుకుని. ముఖంలో కొత్త

కాంతులు ఈనుతూ వుండగా "ఆ గాథంతా గడిచి పోయింది. మీ గ్లాసులు నింపుకుని హాయిగా తాగండి" అన్నాడు.

మళ్ళీ కులాసాగా కబుర్లు, ఆటలూ పాటలూ మొదలయినాయి. ఒకరోజు కుందేలు బజారుకు వెడుతూ – ఉయ్యాల ఊగుతున్న ఓ అమ్మాయిని చూచాడు. కాళ్ళు నిటారుగా ముందుకు లేచిపోతున్నాయి. జుట్టు గాలికి ఎగిరి పడుతుంది. ఆకాశంలోకి పోతూ, మళ్ళీ కిందికి వస్తూ ఆ పిల్ల అతనికి చాలా ముచ్చట గొలుపుతూ కనిపించింది. ఆమె సౌందర్యం కుందేలు మనసులో నాటుకు పోయింది. ఎవరా అని ఇరుగు పొరుగులను వాకబు చేశాడు. తను ఇప్పుడు ధనికుడూ సంఘంలో పలుకుబడీ ఉన్నవాడు. ఆ అమ్మాయికి తనంటే ఇష్టమో అయిష్టమో తనకు లక్ష్యం లేదు. తను ఇష్టపడ్డాడు. అంతేచాలు.

కుందేలు తొందరలోనే యీ వధువును యింటికి తెచ్చుకున్నాడు. ఈమె అతనికి ప్రేమగాని, కట్నం గాని తీసుకు రాలేదు. ఆమె అందం యౌవ్వనమూ చాలనుకున్నాడు కుందేలు. కొన్ని నెలలపాటు – సంసారం సజావుగా సాగింది. ఆమె అడపా దడపా తల్లి దండ్రులను చూచేందుకనీ, యిరుగు పొరుగలతో కబుర్ల కనీ వంక పెట్టుకొని పోతూండడం కుందేలుకు నచ్చలేదు. ఇల్లుదాటి వెళ్ళినప్పుడల్లా చాల సంతోషంగా, ఉల్లాసంగా ఉండేది. మళ్ళీ యిల్లు చేరుకుని ముఖం ముడుచుకుని కూర్చునేది. తనేమీ తప్పు చేయనట్లు నటించేది. ఆమె నడవడికే కాక – యిరుగు పొరుగు వాళ్ళ మాటలు కొన్ని కుందేలు మనసులో సంశయ బీజాలు మొలకెత్తేట్లు చేశాయి.

ఇరుగు పొరుగులను అడిగి జరిగిందేమిటో తెలుసుకుందామనుకున్నాడు. తేలిందేమిటంటే – ఆమెకొక ప్రియుడున్నాడు. ఆ నడవడి మంచిది కాదని, గౌరవ కుటుంబాల స్త్రీలు అలా వుండకూడదని వాదించాడు భార్యతో. కాని ఆ పడుచు భార్య తోసిరాజన్నది. సమయం చిక్కినప్పుడల్లా మెల్లిగా జారివెళ్ళి ప్రియుడి వాడిలో వాలిగేది – తల్లి దండ్రులు కూడా ఆమెను సరయిన దోవలో పెడదామని ప్రయత్నించి విఫలమయ్యారు.

ఆమె మాత్రం భర్తతో ఖచ్చితంగా చెప్పివేసింది. తన నడవడికలో యేమీ లోపం లేదనీ, తనకు ప్రియుడంటూ ఎవరూ లేరనీ, యివన్నీ చుట్టు పక్కలవాళ్ళు తనమీద అసూయ కొద్దీ కల్పిస్తూన్న కల్లబొల్లి మాటలని.

ఒకరోజు అతన్ని గురించి తన స్నేహితురాలితో ఆమె యిలా అంది. ''ఈ ముసలాడిని కట్టుకుని తిరుగుదామని నేనేమీ వివాహం చేసుకోలేదు. ఆయనను తన మొదటి భార్యను గురించి యేమన్నాడో గుర్తు తెచ్చుకోమను. నేనూ తనలాగ ఇరవయి సంవత్సరాలు వేచి వుండలేను''. ఎవరో పుణ్యాత్ములు ఈ మాటలను కుందేలుకు చేరవేశారు. అతని మనస్సు చాల కించ పడింది. భయం అతన్ని కుంగ దీసింది. తనకెవరో విషం పెట్టి చంపాలని చూస్తున్నారని యింట్లో పెట్టి తగలెయ్యాలని ఆలోచిస్తున్నారని – యిరుగు పొరుగులతో మొర పెట్టుకోసాగాడు.

ఇప్పుడితను ఒక్క పగటిపూట మటుకే పని చేస్తున్నాడు. స్వయంపాకమే తింటున్నాడు. భార్య చేతి మీదుగా వచ్చింది యేమీ తినడు. రాత్రిళ్ళు ఇంటిపట్టున వుండడు. వేసవిలో రోజుకో గడ్డివాము మీద పడుకుంటాడు. శీతాకాలం పొరుగువాళ్ళ పశువుల పాకలో పడుకుంటాడు. వయసు బాగా మీరిందేమో – అనుమానం విపరీతంగా వెంబడిస్తోంది. తనలో తాను గొణుక్కుంటూ వుంటాడు. ఈ పరిస్థితుల్లో అయితే అతనికి కొన్నాళ్ళకి మతి పోతుంది– అని ముగించాడు సుందరం.

నేనా కుందేలు ముఖాన్ని – సగం వెలుతురులో చూచిన భయపడిన ముఖాన్ని –నెమరుకు తెచ్చుకుంటూ ''అతనికి ఈ పాటికే మతిపోయి వుంటుందనుకుంటాను'' అన్నాను. ❋

*(ఆంధ్రజ్యోతి వారపత్రిక 30–3–1973)*